క్లుప్తంగా

నేడు రవీంద్ర భారతి వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-3లోని రవీంద్ర భారతి విద్యా సంస్థ 'రవీంద్ర దర్పన్' వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన ఉదయం 5 గంటలకు శిల్పకళా వేదికలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వార్షికోత్సవంలో పార్వతి కల్యాణం, సైరా, కాంతార, నేటి పాటలకు నృత్య ప్రదర్శనలు, అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలతో వీనుల విందు చేయబోతున్నట్లు తెలిపారు. రవీంద్రభారతి విద్యార్థులు కుటుంబ సమేతంగా వచ్చి వీక్షించి ఆనందించాలని కోరారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడ శివాలయం వీధిలో నూతనంగా రూ.20 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు నిర్మించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ఏఈ మొహమ్మద్ రషీద్, స్థానిక నాయకులతో కలిసి బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పరిశీలించారు. రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



రవికుమార్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపి భగవద్గీత పుస్తకాన్ని అందజేస్తూ..

ఆల్విన్‌కాలనీ: నూతన సంవత్సరం 2023ని పురస్కరించుకుని సోమవారం శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు ఎం.రవికుమార్ యాదవ్‌ను బీజేపీ నాయకులు కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. వివేకానందనగర్ డివిజన్ నాయకులు ఎ.గోపాల్‌రావు, కూకట్‌పల్లి పార్టు-2 బీజేపీ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి భూపాల్‌రెడ్డి, కూకట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి గంగుల రాజిరెడ్డి, కూకట్‌పల్లి బీజేపీ నాయకులు చెరుకూరు మహేష్, వివేకానందనగర్ బీజేపీ నాయకులు టి.చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్‌గౌడ్, వివేకానందనగర్ బీజేపీ మహిళా నాయకురాలు డి.రేణుక తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్‌కు భగవద్గీతను ప్రదానం చేశారు.

ముస్లిం గ్రేవ్ యార్డ్ పనుల పరిశీలన



మోతీనగర్: డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో గల ముస్లిం గ్రేవ్ యార్డ్ పనులను సోమవారం ఏఈ రంజిత్‌కుమార్‌తో కలిసి అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. కమాన్ నిర్మించడం పూర్తయ్యిందని, కమాన్‌పై మినార్ నిర్మించడం, చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఈ సందర్భంగా ఏఈ కార్పొరేటర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రేవ్ యార్డ్‌లో మొక్కలను నాటడంతో పాటు అన్ని పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని బస్తీవాసులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జాహెద్ షరీఫ్, పార్వతమ్మ, జ్ఞానేశ్వర్, మల్లేష్, శ్రీనివాస్ యాదవ్, కొండయ్య, శేఖర్, రాజు, లక్ష్మి, వెంకటమ్మ, యోగి పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు



మూసాపేట: ఇందిరా పార్కు వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా చేపట్టడంతో మూసాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చున్నూ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తూము సంతోష్‌లను ఉదయం 5.30 గంటలకు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



వైకుంఠ నిలయ | వరాహ గిరివర

గోవిందా.. గోవిందా

- వైకుంఠ ఏకాదశి సందర్భంగా విష్ణు నామస్మరణతో మార్మోగిన కూకట్‌పల్లి నియోజకవర్గం
- ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని వీక్షించేందుకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేకాలంకరణలో వివేకానందనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారు






శ్రీపాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు, శివాలయంలో వెన్న అలంకరణలో శివలింగం



తులసివనంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, ఉత్సవ మూర్తులు



అల్లాపూర్‌లో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



పండ్లతో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో ఆలయ చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కూకట్‌పల్లి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో వైష్ణవ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి భక్తులు వారి వారి సమీపంలోని ఆలయాలకు చేరుకుని ఉత్తర ముఖ ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

ప్రత్యేకాలంకరణ..

ముక్కోటి ఏకాదశి పర్వదినంను పురస్కరించుకుని గత రెండు రోజుల నుంచే కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని దేవాలయాలను ఆలయ కమిటీ సభ్యులు పూలతో.. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అదేవిధంగా ఆలయంలోని మూల విరాట్‌ను వివిధ పుష్పాలతో తీర్చిదిద్దారు.



వివేకానందనగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో..



భరత్‌నగర్ హరిహర కళాక్షేత్రంలోని శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో.. ఆలయ చైర్మన్ సురేష్ నాయుడు, అర్చకులు బలరామకృష్ణులు



భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో..



కూకట్‌పల్లి రంగనాయక స్వామి ఆలయంలో..



వివేకానందనగర్‌లో శ్రీవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



బాలాజీనగర్‌లో శ్రీసీతారామచంద్ర స్వామి పల్లకి సేవలో.. ఆలయ ఫౌండర్ గూడెపు కొండల్‌రావు, భక్తులు



కూకట్‌పల్లి ఐడియల్ చెరువు సమీపంలో రంగనాయక స్వామి ఆలయంలో..



పాండురంగనగర్‌లోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి జీపీకే కృష్ణ, ఉదయ్‌కుమార్, వీవీ సత్యనారాయణ, కిలారి మనోహర్ తదితరులు

తగ్గేదే.. లే!

- ఎక్సైజ్‌కు న్యూఇయర్ కిక్కిచ్చిన మద్యం బాబులు
- కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో విపరీతంగా మద్యం అమ్మకాలు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పోలీసుల పహారా

బాలానగర్: థర్టీఫస్ట్, నూతన సంవత్సరం 2023ని పురస్కరించుకుని మద్యంను ఏరులై పారించారు కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మందు బాబులు. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే వేళ మద్యం ప్రియులు ఫుల్లుగా మద్యం తాగేసి ఎక్సైజ్ శాఖకు న్యూ ఇయర్‌కు మంచి కిక్కు ఇచ్చారు. చాలా మంది రెండ్రోజుల ముందు నుంచే మద్యం కొనుగోలు చేయడంతో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

రాత్రంతా పహారా...

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అధికారులు 31వ తేదీ రాత్రంతా, 1వ తేదీ రాత్రి 2 గంటల వరకు ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించారు. బాలానగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022 డిసెంబర్ 31వ తేదీ రాత్రంతా విధులు నిర్వహించారు. రాత్రి 8.30 నుంచి ఉదయం 5 గంటల వరకు విధుల్లో ఉండి 77 కేసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నమోదు చేశారు. అదే విధంగా జనవరి 1వ తేదీ రాత్రి 8 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 కేసులు నమోదయ్యాయి.

అర్ధరాత్రి వరకు జాతర...

పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ మద్యం ప్రియులు గత రెండ్రోజుల నుంచి మద్యం కొనుగోలు చేపడుతూ బిజీబిజీగా జాతరలా బార్ షాపుల ముందు బారులు తీరడం కనిపించింది.

దుకాణాలు, హోటళ్లు గిరాకీ...

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఆదివారం జరిగిన మటన్, చికెన్ దుకాణాలతో పాటు రెస్టారెంట్లు, హోటళ్లకు గిరాకీ బాగా ఉంది. ఫతేనగర్‌లో ఉదయం సుమారు గంట సేపు చికెన్, మటన్ దుకాణాల వద్ద నిలిపిన ద్విచక్ర వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బంది కలిగింది. అదే విధంగా బేకరీల్లో కేకులు, స్వీట్లు బాగా అమ్మకాలు జరిగినట్లు దుకాణదారులు చెబుతున్నారు.

బాలానగర్ ఎక్సైజ్...

బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 50 బార్లు, 40 వైన్స్ దుకాణాలు ఉన్నాయి. రెండ్రోజుల్లో రూ.16 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ తెలిపారు.

కేలండర్ ఆవిష్కరణ

కూకట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కొరదాల నరేష్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. 2023 సంవత్సరంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని నరేష్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్ మణిభూషణ్ చారి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి హరికృష్ణ, డివిజన్ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, నవీన్, భూపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, గోపాలరావు, రాజు, రాజిరెడ్డి, లతా తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డా.కొరదాల నరేష్

అన్నీ తానై అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు



ఆల్విన్‌కాలనీ: ఓ అనాథను చేరదీసి ఆశ్రయం కల్పించడంతో పాటు చివరి మజిలీలోనూ అన్నీ తానై సొంత బిడ్డలా అంత్యక్రియలు చేసి తన ఔదార్యాన్ని చాటుకుంది రాజేశ్వరి వృద్ధాశ్రమం నిర్వాహకురాలు రాజేశ్వరి. ప్రాంతం, భాష, కులం, మతంతో సంబంధం లేకుండా ఇబ్బందుల్లో ఉన్న వారిని అక్కున చేర్చుకుని నేనున్నానని భరోసా కల్పించడంతో పాటు అన్నీ తానై ఆ అనాథకు అమ్మలా సేవ చేసి మానవత్వం చాటుకుంది. ఓ వ్యక్తి కూకట్‌పల్లి ప్రాంతంలో పనిచేసుకుంటూ ఓ ప్రైవేట్ హాస్టల్‌లో తలదాచుకుని జీవించేవాడు. కొద్ది రోజుల క్రితం కిందపడి గాయాలు కావడంతో అతడికి ఎవరూ లేకపోవటంతో స్థానికులు అతడి అవస్థలను గుర్తించి కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీలోని రాజేశ్వరి వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించి అతడి ఇబ్బందులు చెప్పడంతో చలించిన రాజేశ్వరి ఆ అనాథ వృద్ధుడికి ఆశ్రయం కల్పించి, వైద్య సేవలకు కూడా అందించింది. ఆయన సోమవారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆశ్రయం కల్పించాలని కోరిన వారికి ఫోన్ చేసి అతడికి బంధువులు ఎవరూ లేరు మీరే అంత్యక్రియలు చేయాలని కోరగా రాజేశ్వరియే 75 ఏళ్ల వృద్ధుడికి సొంత ఖర్చులతో కర్మకాండలు జరిపించింది. దీంతో రాజేశ్వరి చేసిన సేవలను గుర్తించి స్థానికులు ఆమెను కొనియాడారు. ఇప్పటికీ ఈ ఆశ్రమంలో సుమారు 50 మందికి పైగా వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ సేవా దృక్పథాన్ని చాటుకుంటున్నారు రాజేశ్వరి.



ఈడబ్ల్యూఎస్ 794 ఫ్లాట్ వద్ద మంచినీటి మ్యాన్ హోళ్ల లోపల పేరుకుపోయిన చెత్తాచెదారం

దుర్గంధంగా మంచినీటి మ్యాన్‌హోల్

మూసాపేట: మంచినీటి గేట్ వాల్ తిప్పే మ్యాన్ హోల్ చెత్తాచెదారంతో దుర్గంధంగా మారింది. నీరు తిప్పే సమయంలో ఇవే నీరు పైప్‌లైన్ ద్వారా ఇళ్లల్లో కి సరఫరా అవుతున్నాయి. స్థానికులు ఈడబ్ల్యూఎస్ 794 ఫ్లాట్ వద్ద మ్యాన్‌హోల్స్ తెరిచి చూడటంతో మురుగు నీరు దర్శనం ఇచ్చింది. వెంటనే భరత్‌నగర్‌లోని వాటర్‌వర్క్స్ అధికారులకు సమాచారం అందించడంతో వారు రెండు మ్యాన్‌హోళ్లు తెరిస్తే కుళ్లిన చెత్తాచెదారంతో పాటు మురుగు నీరు కనబడగా వెంటనే శుభ్రం చేశారు. కానీ ఇదే విధంగా ఎన్ని మంచి నీటి మ్యాన్‌హోళ్లు ఉన్నాయో అని, ఇలాంటి మురుగు నీటిని తాగుతూ అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శుభ్రం చేస్తున్న సిబ్బంది

ధర్నాను అణచివేయాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్ర



టీపీసీసీ సభ్యుడు డాక్టర్ సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: సర్పంచుల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద సోమవారం ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ధర్నాను అణిచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం పోలీసులచే కాంగ్రెస్ పార్టీ నాయకులను అక్రమ అరెస్టులు చేయడాన్ని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లుల విడుదల చేసి సర్పంచ్‌లను ఆదుకోవాలని, గ్రామ పంచాయితీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని, బీఆర్‌ఎస్ 15వ ఆర్థిక సంఘం నిధులను పక్కదోవ పట్టించిందని, ప్రతి నెలా ఇవ్వాల్సిన రూ.250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం అనాసక్తి చూపుతోందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టించిందని, వెంటనే నిధులు విడుదల చేయాలని సర్పంచుల తరపున కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తుంటే ఆ పోరాటాన్ని అణచి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ నాయకుల్ని అరెస్టు చేయడం దారుణమన్నారు. సర్పంచ్‌లకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటూ వారికి నిధులు వచ్చేదాకా పోరాటం చేస్తుందన్నారు. అనేక మంది సర్పంచుల ఆత్మహత్యలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కొందరు సర్పంచ్‌లు బిక్షాటన చేస్తున్నారని, మరి కొందరు అప్పుల పాలయ్యారని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి సర్పంచ్‌లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారిని సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నవ తెలంగాణ విద్యార్థిశక్తి రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్. - భాగ్యనగర్‌కాలనీ



నూతన సంవత్సరం 2023ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావును కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత. అదే విధంగా ఆమె మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రెటరీ అరవింద్‌కుమార్ జీహెచ్‌ఎంసీ, జోనల్ కమిషనర్లను కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. - కూకట్‌పల్లి